విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 10, మే 2025

## భారత సైన్యానికి జేజేలు : సీపీఐ

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిన భారత సైన్యానికి జేజేలు అని, భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనా యుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాదానికి భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేయడాన్ని ఆనందించే విషయమని, పాకిస్థాన్ భూభాగం నుంచి ఉగ్ర కార్యకలాపాలకు తావు లేకుండా ఉండేందుకు అక్కడి ఉగ్రవాద మౌలిక వసతులపై ఉక్కుపాదం మోపేలా ఈ దాడి ఉగ్రవాదులకు ఒక సమాధానమన్నారు. ఈ ఆపరేషన్‌లో మహిళా నారీమణులు దేశం పైకి వస్తే ఏ మాత్రం సహించమని ముస్లిం మహిళ కల్నల్ సోఫియా ఖురేషి, హిలాల్ అహ్మద్ అలాగే వింగ్ కమాండర్ మహిళా వ్యోమికా సింగ్‌కు సిపిఐ తరపున అభినందనలు తెలియజేశారు.

## జవాన్ మరణం బాధాకరం : సీపీఐ

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మురళి నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫక్రుద్దీన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పుట్ట గుండ్లపల్లి తాండకు చెందిన మురళి నాయక్ దేశం కోసం వీరుని మరణం పొందడం మనసు కలచివేసిందన్నారు. పాకిస్తాన్, భారత్ మధ్య జరిగిన యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందిన మురళి నాయక్ సత్యసాయి జిల్లా వాసి. మురళినాయక్ వీరమరణం తెలుగు ప్రజలకే గాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. యుద్ధంలో మురళినాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. మురళి నాయక్ పవిత్ర ఆత్మకు వారి కుటుంబానికి నంద్యాల జిల్లా సిపిఐ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

## ఏపీ విద్యార్థులను సురక్షితంగా రప్పించండి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** ప్రస్తుత పరిస్థితిలో జమ్మూ, కాశ్మీర్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులను క్షేమంగా తిరిగి రావడానికి కేంద్ర ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. శుక్రవారం కేంద్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి లవ్ అగర్వాల్‌కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లేఖ వ్రాచారు. ప్రస్తుతం జమ్మూ, కాశ్మీర్‌లో చిక్కుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థుల గురించి సంబంధిత కేంద్ర అధికారులు, రక్షణ శాఖ విభాగాలతో సంప్రదించడం, మీతక్షణ జోక్యాన్ని అభ్యర్థిస్తున్నానని ఆమె అన్నారు. ఈ ఎమర్జెన్సీ సమయంలో జమ్మూ, కాశ్మీర్‌లలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు వారి స్థితిని ట్రాక్ చేయడం, రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేయడం, వారి తరలింపును ఏర్పాటు చేయడంలో మీమద్దతు కీలకమని, కుటుంబాలకు సమాచారం అందించడం, వారి పిల్లలుసురక్షితంగా తిరిగివచ్చేలా చూసేందుకు లాజిస్టికల్ మార్గదర్శకాలను అందించండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

## దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయక్

**విశాలాంధ్ర - బనగానపల్లె :** దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ అని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్తాన్‌తో యుద్దంలో సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమైన విషయం అన్నారు. సరిహద్దుల్లో మురళీ నాయిక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకని మురళీ నాయిక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు .

## దేశం కోసం వీర మరణం : మంత్రి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** పాకిస్తాన్తో జరుగుతున్న యుద్ధంలో మురళి నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటన విడుదల చేస్తూ శ్రీ సత్య సాయి జిల్లా, గోరంట్ల మండలం, పుట్ట గుండ్లపల్లి తాండకు చెందిన మురళి నాయక్ దేశం కోసం వీరుని మరణం పొందడం మనసు కల చివేసిందన్నారు. పాకిస్తాన్, భారత్ మధ్య జరిగిన యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందిన మురళి నాయక్ సత్యసాయి జిల్లా వాసి. మురళి నాయక్ వీరమరణం తెలుగు ప్రజలకే గాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. యుద్ధంలో మురళి నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. మురళి నాయక్ పవిత్ర ఆత్మకు వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

## జవాన్ మురళి నాయక్ వీర మరణం స్ఫూర్తి దాయకం

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా :** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందడం చాలా బాధాకరమని ఈ దేశ ప్రజలకు స్ఫూర్తిదయాకమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం పుట్ట గుండ్లపల్లి తాండకు చెందిన మురళి నాయక్ దేశం కోసం వీర మరణం పొందదాని వారి పోరాటం మరువలేనిదన్నారు. పాకిస్తాన్ భారత్ మధ్య జరిగిన యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందిన మురళి నాయక్ తెలుగు ప్రజలకే గాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. యుద్ధంలో మురళి నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. మురళి నాయక్ పవిత్ర ఆత్మకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

## పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన మోడీ

**విశాలాంధ్ర - కోవెలకుంట్ల :** పాకిస్తాన్‌కు భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ తగిన గుణపాఠం చెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ కాశ్మీర్లోని పహాల్గంలో విహారయాత్రకు వెళ్లిన వారిని పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్చిచంపడం దారుణమన్నారు. దీనికి ప్రత్యేకంగా ప్రధాని మోదీ ఆపరేషన్ సింధూరు పేరుతో భారత మహిళల నధుటి మీది బొట్టును తుడిపేసిన పాక్ గడ్డపై ఉన్నటువంటి ఉగ్రవాద శిబిరాలపై భారత్ సైన్యంతో దాడులను నిర్వహించి కేవలం 25నిమిషములలోనే శత్రుదేశం నేలను ఉగ్రవాదుల రక్తంతో తడిపిన భారత సైన్యానికి, వెనక ఉండి నడిపిస్తున్నటువంటి ప్రధాని మోడీకి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ప్రతి ఒక్క భారతీయుడు ఇందులో భాగంగా ఉంటారని పాకిస్తాన్ ఉగ్రవాదులను హతమార్చే చర్యలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి భారతీయుడు భారత సైన్యానికి మద్దతు ఇచ్చి భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు.

## వైసీపీ సీనియర్ నాయకులు గుండెపోటుతో మృతి

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :** మండలంలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్సిపి సీనియర్ నాయకులు ఎస్.రామసు బ్బారెడ్డి(62) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల ఆయనకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో గుండెపోటుకు గురయ్యారు. ఆయన మొదటి నుండి ఎర్రబోతుల కుటుంబానికి విధేయుడుగా ఉంటూ తనదైన రాజకీయ నేపథ్యం కలిగి ఉన్నాడు. వైసీపీ అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారు. రామసుబ్బారెడ్డి మృతి సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబో తుల పాపిరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, అబ్దుల్లాపురం గ్రామ సర్పంచ్ ఎస్వి.నారాయణరెడ్డి, కోరుమాన్ పల్లి పెద్దిరెడ్డి తదితరులు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని వారు తెలిపారు.

## వెలవెల బోతున్న సచివాలయ పాలన

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల సచివాలయంలో అధికారులు సిబ్బంది లేక సచివాలయ పాలన వెలవెలబోతున్నదని గ్రామస్తులు గ్రామ సచివాలయంలో శనివారం సంబంధిత అధికారులు గానీ సిబ్బంది గానీ ఒక్కరు కూడా తమకు కేటాయించిన సీట్లలో కూర్చొని విధులు నిర్వహించక పోవడం పట్ల మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం అని గ్రామస్తులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలకు సచివాలయం ఉద్యోగులు సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రతిష్టాత్మకంగా ఇటీవల విడుదల చేసినటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతోపాటు నూతన రైస్ కార్డుల నమోదు ప్రక్రియను అర్హులైన ప్రతి లబ్ధిదారుల్లో లబ్ధి పొందేలా అందుబాటులో ఉండాలని ఆదేశించగా ఇక్కడ సచివాలయ సిబ్బంది మాత్రం సహచర ఉద్యోగులతో ఇతర కార్యాలయాల్లోకి వెళ్లి కాలక్షేపం కబుర్లు మాట్లాడుకోవడం అవసరమైతే సెలవులు పెట్టి వెళ్లడం కోటపాడు సచివాలయంలో ఒక ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు తెలిపారు. కోటపాడు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని నిబంధనల మేరకు సమయాభావం పాటించాలని అధికారులు చెబుతున్న ఆదేశాలు తుంగలో తొక్కి ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి ఎంపీడీవో ఈవోపీఆర్డి ఇతర మండల స్థాయి అధికారులు తరచూ సచివాలయాల తనిఖీలు పరిశీలనలు విధుల పట్ల బాధ్యతలు అప్పగించడం వంటి పరిపాలన పారదర్శకత చర్యలు చేపట్టాలని కోటపాడు గ్రామ ప్రజలు తెలిపారు.

## ఇది గోడౌన్ కాదు

**విశాలాంధ్ర - రుద్రవరం :** మనకు కనిపిస్తున్న ఈ దృశ్యం ఫోటోలో పొగాకు బెల్స్ ఉన్నాయని ఇదేదో గోడౌన్ అనుకుంటున్నారా అలా అనుకుంటే పొరబడినట్లే. మండల పరిధిలోని డి.కొట్టాల గ్రామంలో గత ప్రభుత్వంలో అంగన్వాడి చిన్నారుల సంక్షేమం కోసం నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రం. నిధులు మంజూరు మేరకు భవనాన్ని నిర్మించి స్లాబ్ వేశారు. నిధులు నిలిచి పోవడంతో భవన నిర్మాణం మధ్యలోని నిలిచిపోయింది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని బస్తాలలో వేసి అక్కడే భద్రపరుచుకుంటున్నారు. ఇటీవల రైతులు పండించిన పొగాకు బేల్స్‌లను వేసి ఉంచారు. దీంతో అంగన్వాడి చిన్నారులకు బడిని నిర్వహించాలంటే ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేసి పనులను పూర్తి చేసి నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్ లో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఐఓ సునీత, డిఈసి మెంబెర్స్ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేది నుంచి 20 వరకు నిర్వహించడం జరుగుతుందనీ ఉ.9.గం.ల నుండి మ.12గం.ల వరకు మొదటి సంవత్సర పరీక్షలు, మ.2:30.గం.ల నుండి సా.5:30 గం.లకు రెండవ సంవత్సర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరంకు సంబంధించి జనరల్ విభాగంలో 10,192 మంది, వొకేషనల్ 587 మొత్తంగా 10,779 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ విభాగంలో 2,959 మంది, వొకేషనల్ 366 మొత్తంగా 3325 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడం జరుగుతుందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలను 42 పరీక్షా కేంద్రాల్లో (ప్రభుత్వ జూనియర్ కళాశాల-19, ఏపి మోడల్ స్కూల్స్-2, ప్రైవేటు అన్ఎయిడెడ్ జూనియర్ కళాశాలు-19) నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు వైద్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఆశా, ఎఎన్ఎంలతో మెడికల్ కిట్స్ ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని డిఆర్ఓ ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. పరీక్షా పూర్తి అయిన తర్వాత పరీక్షా పత్రాలను ఎప్పటికపుడు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా :** మండలంలోని పంటలను సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తంగడంచ గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి అధ్యక్షతన భూసారా పరీక్షల మీద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హేమలత మాట్లాడుతూ రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడటంతో పంట దిగుబడులు పెంచుకోవచ్చని ఆమె రైతులకు తెలిపారు. భూమిలోన్ని కర్బనం, ఉదజని సూచిక, ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాష్ మరియు సూక్ష్మ పోషకాలైన జింక్, ఇనుము, కాపర్, మాంగనీస్, బోరాన్, ద్వితీయ పోషకాలైన సల్ఫేర్ భూములలో ఎంత శాతం ఉందొ తెలుసుకొని పోషక లోపాలను సవరించుకొని మట్టి స్థితిని మెరుగుపర్చుకొని సమగ్ర పోషక యాజమాన్యా పద్ధతుల ద్వారా మంచి దిగుబడులు సాంధించవచ్చునని ఆమె తెలిపారు. సమస్యాత్మక భూములలో మట్టి నమూనాలు వేరొక నమూనా తీసి భూసార పరీక్షా కేంద్రానికి పంపి కారణాలు తెలుసుకోవాలని ఆమె తెలిపారు. పంటలో సూక్ష్మ ధాతువుల లోపాలను సవరించుకోవ చ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తంగడంచ గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రణాళిక రూపొందించండి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** భారత ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణకు నషా ముక్త్ భారత్ అభియాన్ అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఈ మేరకు మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు బానిస కాకుండా సంపూర్ణ అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయిజ్ ఫాతిమా, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్, డిఈఓ జనార్దన్ రెడ్డి, డిఐఓ సునీత, ఐసిడిఎస్ పిడి లీలావతి, జువైనల్ హోం సూపరింటెండెంట్ హుస్సేన్ భాష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ దేశంలో మత్తు పదార్థాల నివారణకు భారత ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని 2020లో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ మేరకు మాదకద్రవ్యాల నివారణకు సంబంధిత అధికారుల నుండి నివేదికలు సేకరించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. మాదకద్రవ్యాల నివారణ కోసం జూన్ 1వ తేది నుండి జూన్ 26వ తేది వరకు సంబంధిత అధికారులు బృందాలుగా వెళ్లి నిర్దేశించిన కార్యక్రమాలను చేపట్టి అవగాహన తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకుగాను వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25లో చేర్చాల్సిన అంశాలపై డిఈఓ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్, ఐసిడిఎస్ పిడి, జువైనల్ హోం సూపరింటెండెంట్, డిఆర్డిఎ కోఆర్డినేటర్, డిఐఓ, మెప్మా, వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

## గ్రూప్స్‌కు ఉచిత కోచింగ్ ప్రారంభం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తమ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా సమ్మర్ కోచింగ్ నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మనోధైర్యంతో మౌలికంగా ఎన్ సిఇఆర్టి పుస్తకాలు చదివితే బేసిక్స్ చాలా వరకు తెలుసుకోవచ్చని, అలాగే హైస్కూల్ బుక్స్ సంపూర్ణంగా చదవాలని, ఎప్పటికప్పుడు చాప్టర్ వైజ్ చదవాలని, పర్సనల్ నోట్స్ కూడా తయారు చేసుకోవాలని, ముఖ్యంగా గడిచిన ప్రశ్నా పత్రాలను బాగా పరిశీలించాలని, ఆబ్జెక్టివ్, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అని సాదాసీదాగా చదవడం వల్ల మెమరీ ఉండదని, సంపూర్ణంగా జ్ఞానాన్ని పొందాలి అంటే డిస్క్రిప్టివ్ పద్ధతిలో చదివి స్వతహాగా ఆబ్జెక్టివ్స్ తయారు చేసుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్జన కాలంలోనే పోటీ పరీక్షలకు అనువైన జ్ఞానాన్ని అందించాలని, అందుకు మంచి సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్‌ను తెప్పిస్తున్నానని, ఇంకా మంచిగా ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తానే స్వయంగా యుపిఎస్సి కోచింగ్ కు పంపిస్తానన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ కేబివి సుబ్బయ్య, కోచింగ్ ఇన్చార్జి రమేష్, అధ్యాపకులు కుమార్ బాలసుబ్రమణ్యం, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## చెన్నకేశవుడి కళ్యాణానికి ఏర్పాట్లు సిద్ధం

**విశాలాంధ్ర - శిరివెళ్ల :** మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో వెలసినటువంటి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి సర్వం సన్నద్ధం చేసినట్లు శుక్రవారం గ్రామ పెద్దలు, ప్రముఖులు ప్రజలు తెలిపారు. వైశాఖ శుద్ధ త్రయోదశి శనివారం ఉదయం శ్రీ చెన్నకేశవ స్వామి వారికి సుప్రభాత సేవ అభిషేకం 12గంటలకు చిత్తా నక్షత్రం నందు అభిజిత్ లగ్న పుష్కరాంశమందు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని అన్నారు. ఉదయం సుప్రభాత సేవ మహా మంగళ హారతి మధ్యాహ్నం ఉచిత అన్నదాన కార్యక్రమం సాయంత్రం గ్రామఉత్సవం నిర్వహించడం జరుగుతుందని కోటపాడు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం 11వ తేదీ వసంతోత్సవ కార్యక్రమంతో కళ్యాణ మహోత్సవ వేడుకలు ముగుస్తాయని అన్నారు. శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానములు రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం పండుగ వాతావరణంలో బంధుమిత్రులతో కళకళలాడుతోంది స్వామివారి కల్యాణ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**విశాలాంధ్ర - పాములపాడు :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డిసిపిఓ స్వప్న అడిషనల్ సిడిపిఓ మంగావల్లి అన్నారు. పాములపాడులోని అంగన్వాడి కేంద్రం 4నందు శుక్రవారం కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహారం, పోషకాహార లోపాలు ప్రతి బాలిక చదువుకోవాలని బాలికలపై జరిగే వేధింపులు, మహిళలకు ఉన్న చట్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లలిత, ప్రభావతి, వెంకటేశ్వరమ్మ, అంగనవాడి టీచర్లు శివలక్ష్మి, నాగమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** ప్రస్తుత సమాజంలో బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అంగన్వాడి సూపర్వైజర్ దస్తగిరమ్మ అన్నారు. కిషోరి వికాసం (కౌమార బాలికల సాధికారత) వేసవి శిక్షణ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం పునరుత్పత్తి ఆరోగ్యం - బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని 5వ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్ గుల్జార్ ఆధ్వర్యంలో 15 నుంచి 18 సంవత్సరాల బాలికలకు అవగాహన కల్పించారు. సూపర్వైజర్ దస్తగిరమ్మ బాల్య వివాహాలు వలన కలిగే అనార్ధాలపై, పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. 9, 19, 21 అంగన్వాడి కేంద్రాల వర్కర్లు శాంతమ్మ,సుశీల,హుస్సేనమ్మ, ఎంఎస్కె గ్రీష్మ, ఆశా వర్కర్ అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

## పోలీసులు భయభ్రాంతులకు గురి చేయడం దారుణం

**విశాలాంధ్ర - గడివేముల :** సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, భయ, భ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అని పాత్రికేయులు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా గడివేముల తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ విజయవాడలోని ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లోకి పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ఇది అమానుషమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారాధినిగా పనిచేస్తున్న మీడియాపై ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులకు ఉసికొల్పడం మంచి పద్ధతి కాదన్నారు.కార్యక్రమంలో మండల విలేకరులు సోఫిసాహేబ్,ఎల్లసుబ్బయ్య, మస్తాన్, ప్రసాద్,హరున్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ

**విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ :** పట్టణంలోని స్థానిక డైమండ్ ఫంక్షన్ హాల్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ యొక్క సిఎస్ఆర్ విభాగమైన 'హ్యుందాయ్ ఐయోనిక్ ఫారెస్ట్' కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నంద్యాల జిల్లాలోని 115చెంచు గిరిజన కుటుంబాలను జీవనాధార వ్యవసాయం నుండి స్థిరమైన ఆగ్రో ఫారెస్ట్ కి మార్చడం ద్వారా సాధికారత కల్పించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదు కోట్ల నిధులతో 290 మంది రైతుల యాజమాన్యంలోని 600 ఎకరాల భూమిని సమిష్టంగా సాగు చేయడానికి సహాయపడి ఆధునిక వ్యవసాయ పద్ధతులలో శిక్షణతో రైతులు మద్దతు పొందుతారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ. సురేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ కేజీ. నాయక్,హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయ్, ఆత్మకూరు హార్టికల్చర్ ఆఫీసర్ చందన మొదలగువారు పాల్గొన్నారు.

## నవధాన్యాల విత్తనాలతో భూమిలో పోషకాలు పెరుగుతాయి

**విశాలాంధ్ర - రుద్రవరం :** ఖరీఫ్ సాగులో వ్యవసాయ రైతులు 30 రకాలకు చెందిన నవధాన్యాలను భూమిపై చల్లడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎంసి ఆర్‌పి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో రైతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు తీసుకోవలసిన యాక్షన్ ప్లాన్‌ను ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను రైతులకు ప్రకృతి వ్యవసాయంలో వచ్చే దాన్యం వల్ల మనుషులు ఆరోగ్యంగానూ ఆనందంగానూ ఉండడం జరుగుతుందని వారు ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆయన తెలిపారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించొద్దు : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - మిడుతూరు :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించొద్దని నందికొట్కూర్ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దశరథ రామయ్య అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రెవిన్యూ సమస్యలు అధికమయ్యాయని విమర్శించారు. రెవిన్యూ సమస్యలు పరిష్కరించడంలో రెవిన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో రైతుల పంట పొలాలకు రాస్తాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎస్టిమేషన్ వేయాలని ఏపీవో నాగమ్మకు ఆదేశించారు. జలకనూరు మద్దిగుండం చెరువు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మైనర్ ఇరిగేషన్ ఏఈకి సూచించారు. గ్రామాల్లో తాగునీటి, పారిశుద్ధ్య పనులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. పంచాయతీరాజ్ డి ఈ, ఆర్‌డబ్ల్యు ఎస్‌డిఈలు గైర్హాజరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

**రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం :** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో వ్యవసాయ యాంత్రికరణ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మోడల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణలో మెలకువలు నేర్చుకొని జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి

**విశాలాంధ్ర - పాములపాడు :** బానముక్కల టర్నింగుకు రాకుండా బైపాస్‌లో వెళ్లే పల్లె వెలుగు బస్సుల డ్రైవర్లు, కండక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని భానుముక్కల వేంపెంట బానకచర్ల గ్రామాల ప్రజలు కోరారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల పది నిమిషాలకు 4099 నెంబర్ గల పల్లె వెలుగు బస్సు బానుముక్కల టర్నింగ్‌కు రాకుండా హైవే రోడ్‌లోనే దింపిపోవడంతో ప్రయాణికులు చిన్నపిల్లలతో, కన్ను ఆపరేషన్ చేసుకున్న వ్యక్తి తీవ్ర ఇబ్బంది గురయ్యారు. మండుటెండలో నేషనల్ హైవేపై దింపి వెళ్లడంపై ప్రయాణికులు తీవ్ర నిరసన వ్యక్తపరిచారు. కండక్టర్ బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు, ప్రతి పల్లె వెలుగు బస్సు బానుముకుల టర్నింగ్ వచ్చే విధంగా చూడాలని బాలముక్కల టర్నింగ్‌కు సుమారు నాలుగు ఐదు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారని తెలిపారు.

# చెన్నై, సూరత్ హైవే రోడ్డును సందర్శించిన సీపీఐ నాయకులు

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:** నగర శివారులో దూపాడు గ్రామం దగ్గర డోన్ రింగ్ రోడ్డు క్రింద భాగంలో స్వరంగ మార్గ పనులు మెగా ఇంజనీరింగ్ కంపెనీ వారు చాలా నాసిరకంగా చేపడుతుండడంతో గురువారం భారీ ప్రమాదం తప్పిందని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్వరంగ మార్గం పనులు జరుగుతున్న సమయంలో 20 మీటర్ల లోతు గొయ్యి పడడంతో వాహనదారులు భయప్రాంతులకు గురయ్యారన్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అప్రమత్తమైన నేషనల్ హైవే అథారిటీ అధికారులు మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్టు వారు ఆ గుంతని పూడ్చడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ రోడ్డు మార్గాన ప్రయాణిం చాలంటే ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాన్ని సాగించే పరిస్థితి ఉన్నదన్నారు. తక్షణమే కలెక్టర్ గుంతపడిన ప్రాంతాన్ని సందర్శించి సమగ్రమైన విచారణ చేయించాలని, గుంత పడడానికి కారణమైన అన్ని అంశా లను పరిశీలించాలని, నాసి రకమైనట పనులు చేస్తున్న మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పి.రామ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, కార్యవర్గ సభ్యులు భద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర నాయకులు బాబయ్య, రాముడు, గుంత పడిన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించడం జరిగింది. భవిష్య త్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు అధికారులు చేపట్టాలని, ఎప్పటికప్పుడు జరిగే పనులను సేఫ్టీ కంట్రోల్ నిపుణులు పనులను పరిశీలించాలన్నారు.

# టిడ్కో గృహాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలి : సీపీఐ

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** నగర శివారులో ఉన్న టిడ్కో గృహాల సముదాయానికి ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ నగరకార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం నగర సమితి ఆధ్వర్యంలో కర్నూలు డిపో-1 మేనేజర్ సుధారాణికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, నగర కార్యవర్గ సభ్యులు కుమారు, నగర శాఖ కార్యదర్శి బాబయ్య , ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరానికి 8 కిలోమీటర్ల దూరంలో పేద ప్రజల కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు పదివేల టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టిందని, ఇప్పటికే సౌకర్యాలు లేక చేరడం లేదన్నారు. కొంతమంది పేదవారు ఇంటి అద్దె కట్టలేని వారు దాదాపు 300 కుటుం బాలు టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్నారన్నారు. ఉపాధి పనుల కోసం కర్నూలు నగరానికి రావాలన్నా వారి పిల్లలు చదువుకోవడానికి స్కూల్‌కు కాలేజీకి, రావాలన్న అక్కడ ఉంటే ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో హాస్పిటల్‌కి రావాలన్నా రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఎలాగో పట్టడానికి వచ్చి కూలి పని చేసుకుని తిరిగి సాయంత్రం టిడ్కో గృహాల వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యాలు లేక ప్రైవేట్ వాహనాలు రూ.200, రూ.300, వందలు అడుగుతున్న పరిస్థితి ఉందని, వారు రోజంతా కష్టపడి పని చేసి సంపాదించిన డబ్బులు ఎక్కువ శాతం రవాణా కోసం ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. చాలామంది పేద ప్రజలు టిడ్కో గృహాలలో జాయిన్ అయి తిరిగి పట్టణాల్లో అద్దె గృహాలకు వెళ్ళిపోతున్నారన్నారు. ఏపీఎస్ఆర్టీసీ వారు స్పందించి టిడ్కో గృహాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే అక్కడ ప్రజలకు, విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో టిడ్కో గృహాల ప్రజలతో కలిసి ప్రత్యక్ష ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## క్రీడల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలి

**విశాలాంధ్ర- పత్తికొండ:** విద్యార్థి దశ నుండే క్రీడల్లో నైపుణ్యతను పెంపొం దించుకోవా లని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ పవన్ కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్, యువ నాయకులు వర్ల ప్రకాష్ సూచించారు. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్ రూరల్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ మాయలో పడి సమయాన్ని వృధా చేసుకోకుండా క్రీడా మైదానాలకు వెళ్లి తమకు ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యతలో పెంపొందించుకోవాలన్నారు. క్రీడలు ఆడడం వలన శారీరకంగా, మానసికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాలీబాల్ కోచ్ ఇ.రామాంజ నేయులు, కేవీకే వాలీబాల్ కోచ్ ధనుంజయ, ఉపాధ్యాయులు రామ్మోహన్, రంగస్వామి, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పూడికతీత పనులు పకడ్బందీగా చేపట్టాలి

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ:** నగరంలోని 52 వార్డుల్లో చేపట్టిన పూడికతీత పనులను పకడ్బందీగా నిర్వ హించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దపడఖాన, దండెగేరి, తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించేందుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగా రూ.1.06 కోట్లతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి వార్డులో 15 మందికి పైగా ప్రత్యేక సిబ్బందితో ప్రధాన మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయని వెల్లడించారు. సుద్దవాగులో తొలి దశ పూడికతీత పనులు పూర్తి అయ్యాయని,కేసీ కెనాల్‌లో సైతం పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నగర ప్రజలు నగరపాలకకు సహకరిం చాలని, వ్యర్థాలను మురుగు కాలువల్లో, నదుల్లో వేయొద్దని, వాటిని పారిశుద్ధ్య సిబ్బందికే అప్పగించాలని కమిషనర్ కోరారు. కార్పొరేటర్ కురుబ పరమేష్, డీఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ మహేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి గంటల నుండి గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్ర డీజీపి ఆదేశాలతో, కర్నూలు జిల్లా ఇంచార్జ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లాడ్జీలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, బార్డర్ చెక్ పోస్టులు అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలకు అనుమానాస్పద వ్యక్తులు, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జీ నిర్వాహకులకు పోలీసు అధికారులు తెలిపారు.

## బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

**విశాలాంధ్ర - పెద్దకడబూరు:** బాల్య వివాహాలపై తల్లిదండ్రు లకు అవగాహన కల్పిం చాలని చైల్డ్ సోషల్ వర్కర్ గీతావాణి సూచించారు. శుక్ర వారం మండల కేంద్రం లోని స్థానిక సచివాలయం-1 నందు కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కిశోర బాలికల వయస్సు పెరిగేకొద్ది శరీరంలో వచ్చే మార్పులు, వికాసం వంటి తదితర జాగ్రత్తలు వివరించారు. 11 నుండి 18 ఏళ్ల బాలికలకు రుతుక్రమ శుభ్రత, లింగ అసమానతలు, బాలల హక్కులు, రక్షణ వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు సుకన్యమ్మ, చిట్టెమ్మ, ఆదిలక్ష్మీ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

**విశాలాంధ్ర- కర్నూలు:** కల్లూరు మండలం పెద్దపాడు మోడల్ స్కూలులో స్పోర్ట్స్ అథా రిటీ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాం పును డీఎస్‌డీవో భూపతిరావు, సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. భూపతిరావు మాట్లాడుతూ కోచ్ షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణలో ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతున్నారని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో సమయం వృధా చేయకుండా తైక్వాండోలో శిక్షణ పొందాలని సూచించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడలు సాధన చేయడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. విద్యఉద్యోగాల్లో కూడా స్పోర్ట్స్ సర్టిఫికెట్స్ ఉన్న వారికి ఉపయోగపడుతాయని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ క్యాంపు ఇంఛార్జీగా ఇర్ఫాన్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆఫీస్ పీఎస్ఒ ఎం.ఆనంద్, ఆంధ్రజ్యోతి విలేకరి దౌలత్ బాష, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అఖిల, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలతో దుష్ప్రభావాలు అధికం

**విశాలాంధ్ర - ఆదోని రూరల్:** బాల్యవివాహాలతో మహిళలకు దుష్ప్రభావాలు అధికమవుతాయని సూపర్‌వైజర్ సావిత్రి అన్నారు. పట్టణంలోని కల్లుబావి సెంటర్ 50 అంగన్వాడీ టీచర్ సరోజ సమక్షంలో కిషోర్ బాలికల వికాస్ శిక్షణ తరగతులలో భాగంగా శశాంక్ రెండు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ పృధ్వీరాజ్ ప్రసంగించారు. బాల్యవివాహాలతో ప్రసూతి సందర్భంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రతి తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంఎస్కే అంజలి, ఏఎన్ఎం అనసూయ, అంగన్వాడీ కార్యకర్తలు గీత, రోషన్ బీ, కనకవల్లి పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పుకు భూ యజమానులు సహకరించాలి

**విశాలాంధ్ర -కర్నూలు సిటీ:** నగరం గుండా వెళ్లే 2.3 కిలోమీటర్ల పొడవైన నంబర్ 340సీ రోడ్డు వెడల్పు చేయు కార్యక్రమానికి సంబంధించిన భూ యజమానులు మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరిం చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య కోరారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ హాల్ సమావేశం మందిరంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి నందికొట్కూరు రోడ్డులో శ్రీసాయి గార్డెన్స్ వరకు రోడ్డు వెడల్పులో ప్రభావితమయ్యే భవన, స్థలం యజమానులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు నెలల కిందట జరిగిన సమావేశంలో అందరి కోరికపై 120 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డును వంద అడుగుల రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడం జరిగిందని, భవన, స్థలం యజమానులు వెంటనే తమకు సంబంధించిన డాక్యుమెంట్లను మున్సిపల్ కార్పోరేషన్‌కి అందించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన రివైజ్డ్ వాల్యుయేషన్ ప్రకారం ఖాళీ స్థలానికి టీడీఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు వాటి ఏరియానుబట్టి ఆర్ అండ్ బీ విభాగం వారు చేసే వ్యాల్యూషన్ బట్టి నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ నెల 16 లోపల యజమానులు వారికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ని సమర్పించినట్లయితే వాటిని వెంటనే స్క్రూటీనీ చేసి అప్రూవల్ చేయడం జరుగుతుందని, తదుపరి సర్వే చేసి రోడ్డును నిర్మించడం కూడా జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. యజమానులు వీలైనంత త్వరగా డాక్యుమెంట్లను మున్సిపల్ కార్పొరేషన్ కు అందజేసి సహకరించవలసిందిగా కోరారు. ఈ సమావేశానికి టౌన్ ప్లానింగ్ అధికారి ప్రదీప్ కుమార్, భూ యజమానులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పోరేషన్ రుణాల కోసం దరఖాస్తుకు గడువు పెంచాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10న చివరి తేదీ ఉండగా గత రెండు రోజుల నుండి సర్వర్ సరిగా పని చేయకపోవడం, శనివారం రోజు సెలవు దినం కావడంతో చాలామంది అభ్యర్థులు నష్టపోతు న్నారని, దరఖాస్తు చేసుకోవడానికి గడవు పొడిగించాలని ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ నాయకులు కోరారు. శుక్రవారం ఏఐవైఎఫ్, డిహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజు, డీహెచ్‌పీఎస్ పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, నగరనాయకులు దావీదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, మహేష్‌లు మాట్లాడుతూ దాదాపు 2018 నుండి ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయలేద న్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి అప్లై చేసు కోవడానికి గడువు పొడిగించడంతోపాటు అప్లై చేసిన ప్రతి అభ్యర్థికి లోన్ మంజూరు చేసి ఎస్సీ ప్రజల అభ్యున్నతికి పాటుపడాలని డిమాండ్ చేశారు.

## చుక్కా మంచినీరు లేక 30 కుటుంబాలు

# పరేషాన్

**విశాలాంధ్ర- చిప్పగిరి:** గత కొన్నేళ్లుగా తాగేందుకు చుక్కా మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామ ఎస్సీ కాలనీవాసుల నీటి తిప్పలు వర్ణనాతీతం. సుమారు పదేళ్లుగా ఎస్సీ కాలనీ వాసులు మంచినీరు లేక ఉప్పు నీరే తాగుతూ అనారోగ్యాల బారినపడి ఆసుపత్రి పాలు అవుతున్నామని, మంచినీటి సమస్యపై ఎస్సీ కాలనీకి చెందిన 30 కుటుంబాలు పలుమార్లు మండల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆరోపించారు. డివిజన్ రెవెన్యూ అధికారులు మాత్రం గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ మంచి నీటి సమస్య అలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామ అధికారులదేనని చెబుతున్నారు తప్ప, మంచినీటి సమస్య మాత్రం పరిష్కరించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు ఎస్సీ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీవాసులకు మంచినీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడ్డారు. మంచినీటి సమస్యపై గ్రామ పంచాయతీ అధికారిని ప్రమీళను వివరణ కోరగా చిప్పగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీ నందు మంచినీటి సమస్య ఉన్నది వాస్తవమేనని, 30 కుటుంబాలకు మంచినీరు అందించేందుకు ప్రత్యేక వాల్ ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి

**విశాలాంధ్ర - హొళగుంద:** హొళగుంద పరిషత్ హై స్కూల్ విద్యార్థి ఎన్ఎస్ సందేశ్ గత నెల 13న జరిపిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షల్లో కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడని హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. జనరల్‌లో స్టేట్ ఐదో ర్యాంకులు ఉత్తీర్ణత సాధించాడని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలకు విద్యార్థి సందేశ్ హాజరై తన ప్రతిభను చాటి స్టేట్ ర్యాంక్ సాధించినందుకు హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ విద్యార్థిని అభినందించారు. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలయంలో ఎక్కడైనా విద్యార్థి హాజరై విద్యాబోధన కొనసాగించవచ్చుని, అన్ని వసతులు విద్యార్థికి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

## గృహ నిర్మాణ లబ్ధిదారులకు నోటీసులు

**విశాలాంధ్ర -చిప్పగిరి:** మండలంలోని ఆయా గ్రామాలలో వివిధ దశలలో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు హౌసింగ్ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నోటీసులు అందించడం జరిగిందని మండల హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామదుర్గం గ్రామం నందు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని పూర్తి చేయని యెడల బిల్లులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ గృహాలు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారులు గృహ నిర్మాణాలను తప్పక పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ ఇంటిలో సోదాలు హేయమైనా చర్య

**విశాలాంధ్ర -గోనె గండ్ల:** నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటువడే పత్రికా సంస్థల ఎడిటర్ ఇళ్లపై ఎలాంటి సమా చారం లేకుండా, కనీసం నోటీసులు జారీ చేయకుండా సోదాలు చేయడం హేయమైనా చర్య అని మండల జర్నలిస్టులు అక్బర్ వలి, గౌస్ మొద్దీన్‌లు అన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల జర్నలిస్టులు స్థానిక తహ శీల్దార్ కార్యాలయం నందు నిరసన తెలిపి, అనంతరం తహశీల్దార్ కుమార స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి అక్రమాలను వెలుగు లోకి తీయడంతో పాటు ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగా స్వాములు అవుతున్న పత్రిక రంగంపై దాడి చేయడం ప్రజాస్వామానికి గొడ్డలి పెట్టినట్లుగా భావిస్తున్నామన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం చాలా దారుణమన్నారు. జర్నలిస్టులు కరుణాకర్, ఈశ్వర్, కిరణ్ కుమార్, షఫీ, వీర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగాన్ని పరిశీలించిన న్యాయమూర్తి

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణాన్ని న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందున్న దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగనాన్ని (శక్తి సదన్) తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కార్యాలయాలకు సంబం దించిన రిజిస్టర్‌లను పరిశీలించి వాటిని సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్, మహిళా ప్రాంగణం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

**విశాలాంధ్ర - ఆదోని రూరల్:** అప్ గ్రేడైన పురపాలక ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను కేటాయించి భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పురపాలక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాల, కిల్చిన్పేట, అందర్ పేట, అస్మియా ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాలలకు హెచ్ఎం పోస్టులను కేటాయించాలన్నారు. అప్ గ్రేడ్ చేసి ఏళ్లు అయినా ఇంతవరకు విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు లోక్యానాయక్, వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమ్రాజు, రాజా సతీష్, గంగా నాయక్ పాల్గొన్నారు.

# ప్లె కార్డులతో నిరుపేద దళితుల నిరసన..

**విశాలాంధ్ర - ఆస్పరి:** దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమికి పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భూమిలేని నిరుపేద దళితులు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ రామేశ్వర రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిజన వీరేష్, హరిజన సుంకన్న, హరిజన నాగరాజు, హరిజన విజయ్, మాదిగ గాయత్రీ, హరిజన లక్ష్మీ, హరిజన రంగస్వామి, హరిజన రమేష్‌లు మాట్లాడుతూ మండల పరిధిలోని కైరుప్పల గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 578/ ఏ1, ఏ2, ఏ3, ఏ4, ఏ5లో 23 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ ప్రభుత్వ భూమిని గత కొన్ని ఏళ్లుగా కైరుపుల గ్రామానికి చెందిన పది మంది దళిత కుటుంబాలు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. తమకు ఏలాంటి భూములు లేవని, అయితే బిల్లేకల్లు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఆ ప్రభుత్వ భూమిపై కన్నేసి 23 ఎకరాల సాగు భూమిని కొంతమంది బినామీల పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని వారు ఆరోపించారు. సాగులో ఉన్న నిరుపేదలపై దౌర్జన్యం చేస్తూ భూములు ఖాళీ చేసి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నాడన్నారు. ప్రభుత్వం మాది, మీరేమీ చేసుకోలేరు, తక్షణమే ఈ భూములను వదిలి వెళ్లిపోవాలని ఆ నాయకుడు తన అనుచర గణంతో జేసీబీ తీసుకువెళ్లి సాగు చేస్తున్న రైతులపై దౌర్జన్యం చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు తెలిపిన వారు పట్టించుకోవడంలేదని వాపోయారు. తమ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను ఇతర గ్రామాలకు చెందిన భూములు ఉన్న రైతులకు పాసు పుస్తకాలు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. 2017 సంవత్సరంలో కంప్యూటర్ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలుస్తుందన్నారు. అయితే ఏ రోజు తాము సాగు చేసుకుంటున్న భూములువైపు కన్నెత్తి చూసిన దాఖలు లేవన్నారు. 578 సర్వే నెంబరు ఎక్కడుందో వాళ్లకి తెలియదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో బినామీ పేర్లతో కంప్యూటర్‌లో పేర్లు ఎక్కించుకొని తపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. కైరుప్పల రెవిన్యూ పరిధిలో సెంటు భూమిలేని నిరుపేద దళితులైన తమకు రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ జరిపి, దండోరా వేయించి తమకు న్యాయం చేసి, సాగులో ఉన్న నిరుపేద దళితులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

## అణు బాంబు దాడి జరిగితే..

- వెంటనే లోపలికి వెళ్లండి.. బలమైన భవనం లేదా భూగర్భ ఆశ్రయంలోకి వెళ్లండి.. కిటికీలు, తలుపులకు దూరంగా ఉండండి.
- ఆశ్రయం లోపలనే ఉండండి.. కనీసం 24 గంటలపాటు బయటకు రావొద్దు. ఏదైనా భవనం మధ్య భాగం లేదా బేస్మెంట్‌లో ఉండండి.
- బయటనుంచి వచ్చినట్లయితే శుభ్రం చేసుకోండి.. పెంపుడు జంతువులను కూడా శుభ్రంగా ఉంచుకోండి.
- వార్తలు వినండి.. బ్యాటరీ రేడియో లేదా ఫోన్ ద్వారా అధికార సమాచారం తెలుసుకోండి.
- అధికారులు చెప్పినప్పుడు మాత్రమే బయటకు రండి,
- తినే వాటిని జాగ్రత్తగా వాడుకోండి.
- పిల్లలు, వృద్ధులు అనారోగ్యవంతులపట్ల శ్రద్ధలు తీసుకోండి.
- ముందుగానే అవసరమైన వన్నింటిని సిద్ధంగా ఉంచుకోండి. అత్యవసర కిట్ సిద్ధంగా పెట్టుకోండి.
- జీవితం విలువైనది - ముందుగా జాగ్రత్తపడితే ప్రాణం నిలుస్తుంది.

- విశాలాంధ్ర కర్నూలు డెస్క్

## చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ

**విశాలాంధ్ర - బనగానపల్లె:** మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడే శ్వరి అమ్మవారికి దేవ స్థానం నందు శుక్రవారం పల్లకి సేవ కార్యక్రమం ఈవో కామేశ్వరమ్మ, ఆలయ పండితులు నిర్వహించారు. మాజీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.


మరిన్ని వార్తలు E-PAPERలో

# ఆపరేషన్ సిందూర్ జయహో

విశాలాంధ్ర - పాణ్యం : ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోడీ వంతమని వైసీపీ సీనియర్ నాయకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులను రాజకీయ పార్టీలకు అతీతంగా స్వాగతిస్తున్నామని ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసిన దాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉన్న అణచివేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉండడం విశేషమని పహల్గాం కిరాతక దాడి దేశ ప్రజలను

కలచివేసిందని, కిరాతక ఉగ్రవాదులను అణచివేసే దిశగా ప్రభుత్వం దాడులు నిర్వహించటం అభినందనీయమన్నారు. అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులను, అంతమెందించేలా భారత్ చేసిన దాడులకు ప్రపంచ దేశాలన్నీ మద్దతు తెలపటం, మన భారత దేశానికే గర్వకారణం అన్నారు. సాధారణ పౌరులకు హాని కలిగించ కుండా దాడులు చేసి ముష్కరులకు సరైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలపై ప్రజలకు హాని కలగకుండా ఖచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడం మన దేశ టెక్నాలజీ, శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశంలో అంతర్గత కలహాలు సృష్టించాలని ప్రయత్నించిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను భారత ప్రజలు కుల మతాలకతీతంగా సమైక్యంగా ఆపరేషన్ సింధూరతో తిప్పి కొట్టారని తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎన్ఎండీ ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఈనెల 15వ తేదీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పుట్టినరోజు సందర్భంగా 33వ వార్డు టిడిపి ఇంచార్జ్ జోసఫ్, 28 వ వార్డు టిడిపి ఇంచార్జ్, మాజీ కౌన్సిలర్ కృపాకర్ ఆధ్వర్యంలో ఫారుక్ యువసేన సభ్యులు స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నందు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ క్రీడాల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల దయాసిస్ సెక్రటరీ జెక్కమ్ స్టాన్లీ విలియమ్స్, ఫరూక్ యువసేన సభ్యులు జార్జ్, శరత్, దివాకర్, ధనరాజ్, విజయానంద్, మధు, ప్రవీణ్, సాయి, శేఖర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు వీధి వ్యాపారులందరూ సహకరించాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు కోరారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులకు ఐడి కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వెంకటరమణ కాలనీ, సి.క్యాంపు, బిర్లా కాంపౌండ్ ప్రాంతాల్లో సుమారు 100 మంది వ్యాపారం చేసుకునే విధంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వెండింగ్ కమిటీ ఈ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 12 నుండి వీధి వ్యాపారస్తుల రీసర్వే ప్రారంభం అవుతుందని, వీధి వ్యాపారస్తుల వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చినప్పుడు వాస్తవ సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఇప్పటికే నమోదైన వారు ఏవైన మార్పులు చేర్పులు ఉంటే చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వెండింగ్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ పరమేష్, టీనీఆర్ఓ వెంకటలక్ష్మి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటి మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

విశాలాంధ్ర - బనగానపల్లె: కోవెలకుంట్ల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి రజితోత్సవకుంభాభిషేక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదములు ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరు శీనయ్య తెలిపారు. సీనయ్య మాట్లాడుతూ కోవెలకుంట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సభ్యుల సహకారంతో రజతోత్సవ కుంభాభిషేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా చాలా ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన టీసీ ఇందిరా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కర్నాటి అభిలాష్, యువజన సంఘం సభ్యుల సహకారంతో మండి మర్చంటు అసోసియేషన్ అధ్యక్షులు ఇస్కాల ప్రసాదు, పెండేకంటి సుబ్రహ్మణ్యం, కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ముఖ్యంగా కోవెలకుంట్ల ఆర్యవైశ్యుల అందరికీ బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘంశాశ్వత గౌరవాధ్యక్షులు పిఎస్ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భరతుడు, కాసుల జంగం శెట్టి, బింగుమళ్ల సుబ్రహ్మణ్యం, కేతేపల్లి శివరాజు, తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి : ఎంపీపీ

విశాలాంధ్ర - పాములపాడు : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సరోజినీ వర్ధినయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ సరోజిని వర్ధినయ్య అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు హాజరయ్యారు. ముందుగా గత మూడు నెలల ప్రగతి నివేదికను శాఖల అధికారులు చదివి వినిపించారు. ఏపీఎం ఉమామహేశ్వరి పొదుపు మహిళలు స్వయం ఉపాధికి రుణాన్ని తీసుకొని అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఏపీవో అలివేలు మంగమ్మ ఆర్టికల్చర్ వివిధ పండ్ల తోటలు పెంపకానికి ఆసక్తి గల రైతులు ముందుకు వచ్చినట్లయితే ఉచితంగా మొక్కల పంపిణీ మూడు సంవత్సరాల పరిరక్షణ కోసం నగదును చెల్లించడం జరుగుతుంది అన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తమలపాడు మండలంలోని భానుముక్కల గ్రామంలో టెన్ మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు తద్వారా సబ్ స్టేషన్ లకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు అలాగే ప్రధానమంత్రి సూర్య గారు పథకానికి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు ఈ పథకం ఎస్సీలకు వందశాతం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇసుకాల గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు అడిగారు. ఐసిడిఎస్ అదనపు సిడిపిఓ మంగావల్లి మాట్లాడుతూ మండలంలో 51 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని, తద్వారా గర్భిణీలకు బాలింతలకు ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. కిషోర్ వికాసం బాల్య వివాహాలపై గ్రామాలలో ఎమ్మెస్ కే ఏఎన్ఎంఓ కమిటీ ద్వారా అవేర్నెస్ ప్రోగ్రాములు నిర్వహిస్తున్నామని తెలిపారు. తహశీల్దార్ సుభద్రమ్మ మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులకు ఈ నెల చివరిదాకా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా చర్య తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఎంపీపీ సరోజినీ వర్ధినయ మాట్లాడుతూ అధికారులు గ్రామాలలో నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు సర్పంచులు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేత

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ నందు పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తూ డిసెంబర్ 21, 2023న అనారోగ్యంతో మృతి చెందిన పి.మాదక్క కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తూ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ మాదక్క కుమారుడు పంభ శేఖర్‌కు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్ళికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న బాలుడు

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని గొళ్లలదొడ్డి గ్రామంలోని బందువుల పెళ్ళికి వచ్చి, బావిలోపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గొళ్లలదొడ్డి గ్రామంలో స్నేహితుని పెళ్లికి వచ్చి నీళ్లు తాగేందుకని వెళ్లి ప్రమాదవషాత్తు కాలు జారీ బాలు (13) అనే బాలుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. బాలుడు కర్ణాటకలోని సిరుగుప్ప గ్రామానికి చెందిన వాడు కాగా, స్నేహితులతో వచ్చి గొళ్లలదొడ్డి గ్రామ సమీపంలోని చిన్న లింగన్న బావి దగ్గరికి వెళ్లారు. బాలు అనే బాలుడు ఈత రాదని చెప్పి బావి ఒడ్డు పైనే ఉన్నాడు. అయితే ఈత అయ్యాక, బావి దగ్గర నుండి కొంత దూరం వెళ్ళాక దప్పిక అవుతుందని, ఆ బాలుడు నీళ్లు తాగి తొందరగా వస్తానని చెప్పి, మీరిక్కడే ఆగండని చెప్పి తిరిగి అదే బావి దగ్గరికి వెళ్ళాడు.బావిలో నీళ్లు తాగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఊపిరి ఆడక శ్వాస విడిచాడు. ఎంతసేపటికి ఆ బాలుడు తిరిగి రాలేదని ఎదురు చూసిన స్నేహితులకు అనుమానం వచ్చి బావి దగ్గరికి వెళ్లి చూడగా శవమై కనిపించడంతో లబోదిబోమంటూ, విలపిస్తూ విషయాన్ని సంబంధీకులకు తెలిపారు. బెళగల్ పోలీసులు విచారించి బందువుల ఇష్ట ప్రకారమే మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిసింది.

## ఎడిటర్ ఇంటిలో సోదాలు హేయమైనా చర్య

విశాలాంధ్ర -గోనెగండ్ల: నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే పత్రికా సంస్థల ఎడిటర్ ఇళ్లపై ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం నోటీసులు జారీ చేయకుండా సోదాలు చేయడం హేయమైనా చర్య అని మండల జర్నలిస్టులు అక్బర్ వలి, గౌస్ మొద్దీన్‌లు అన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల జర్నలిస్టులు స్థానిక తహ శీల్దార్ కార్యాలయం నందు నిరసన తెలిపి, అనంతరం తహశీల్దార్ కుమార స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి అక్రమాలను వెలుగు లోకి తీయడంతో పాటు ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రి యలో భాగా స్వాములు అవుతున్న పత్రిక రంగంపై దాడి చేయడం ప్రజాస్వామానికి గొడ్డలి పెట్టినట్టుగా భావిస్తున్నామన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం చాలా దారుణమన్నారు. జర్నలిస్టులు కరుణాకర్, ఈశ్వర్, కిరణ్ కుమార్, షఫీ, వీర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుకు గడువు పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10న చివరి తేదీ ఉండగా గత రెండు రోజుల నుండి సర్వర్ సరిగా పని చేయకపోవడం, శనివారం రోజు సెలవు దినం కావడంతో చాలామంది అభ్యర్థులు నష్టపోతున్నారని, దరఖాస్తు చేసుకోవడానికి గడవు పొడిగించాలని ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ నాయకులు కోరారు. శుక్రవారం ఏఐవైఎఫ్, డిహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజు, డీహెచ్‌పీఎస్ పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, నగరనాయకులు దావీదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, మహేష్‌లు మాట్లాడుతూ దాదాపు 2018 నుండి ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి అప్లై చేసుకోవడానికి గడువు పొడిగించడంతోపాటు అప్లై చేసిన ప్రతి అభ్యర్థికి లోన్ మంజూరు చేసి ఎస్సీ ప్రజల అభ్యున్నతికి పాటుపడాలని డిమాండ్ చేశారు.

## చుక్కా మంచినీరు లేక 30 కుటుంబాలు

# పరేషాన్

విశాలాంధ్ర- చిప్పగిరి: గత కొన్నేళ్లుగా తాగేందుకు చుక్కా మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామ ఎస్సీ కాలనీవాసుల నీటి తిప్పలు వర్ణనాతీతం. సుమారు పదేళ్లుగా ఎస్సీ కాలనీ వాసులు మంచినీరు లేక ఉప్పు నీరే తాగుతూ అనారోగ్యాల బారినపడి ఆసుపత్రి పాలు అవుతున్నామని, మంచినీటి సమస్యపై ఎస్సీ కాలనీకి చెందిన 30 కుటుంబాలు పలుమార్లు మండల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని కాలనీవాసులు ఆరోపించారు. డివిజన్ రెవెన్యూ అధికారులు మాత్రం గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ మంచి నీటి సమస్య అలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామ అధికారులదేనని చెబుతున్నారు తప్ప, మంచినీటి సమస్య మాత్రం పరిష్కరించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు ఎస్సీ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీ వాసులకు మంచినీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడ్డారు. మంచినీటి సమస్యపై గ్రామ పంచాయతీ అధికారిని ప్రమీళను వివరణ కోరగా చిప్పగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీ నందు మంచినీటి సమస్య ఉన్నది వాస్తవమేనని, 30 కుటుంబాలకు మంచినీరు అందించేందుకు ప్రత్యేక వాల్ ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద పరిషత్ హై స్కూల్ విద్యార్థి ఎస్ఎస్ సందేశ్ గత నెల 13న జరిపిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షల్లో కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడని హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. జనరల్‌లో స్టేట్ ఐదో ర్యాంకులు ఉత్తీర్ణత సాధించాడని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలకు విద్యార్థి సందేశ్ హాజరై తన ప్రతిభను చాటి స్టేట్ ర్యాంక్ సాధించినందుకు హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ విద్యార్థిని అభినందించారు. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలయంలో ఎక్కడైనా విద్యార్థి హాజరై విద్యాబోధన కొనసాగించవచ్చని, అన్ని వసతులు విద్యార్థికి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

## గృహ నిర్మాణ లబ్ధిదారులకు నోటీసులు

విశాలాంధ్ర -చిప్పగిరి: మండలంలోని ఆయా గ్రామాలలో వివిధ దశలలో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు హౌసింగ్ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నోటీసులు అందించడం జరిగిందని మండల హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామదుర్గం గ్రామం నందు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని పూర్తి చేయని యెడల బిల్లులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ గృహాలు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారులు గృహ నిర్మాణాలను తప్పక పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - మిదుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు పదో తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహి స్తున్నట్లు ఆలయ ఈవో ఏడీ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. 10వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు మేష లగ్నము నందు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవము, ఉదయం 8 గంటలకు శేష వాహనం, రాత్రి 7 గంటలకు హనుమత్ ఉత్సవ కార్య క్రమం, 11వ తేదీ ఆదివారం వైశాఖ శుద్ధ చతుర్దశి ఉదయం 8 గంటలకు సింహ వాహనము, రాత్రి 7:30 గంటలకు గరుడో త్సవము, 12వ తేదీ సోమవారం వైశాఖ శుద్ధ పూర్ణిమ రోజు ఉదయం రథాంగ హెూమం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవ కార్యక్రమం, 13వ తేదీ మంగళవారం ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి కార్యక్రమం సాయంత్రం 5.30 గంటలకు పారువేట మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ బ్రహ్మోత్సవా వేడుకలను జయప్రదం చేయాలని కోరారు

## అర్హులందరికి రేషన్ కార్డులు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం నూతన బియ్యం కార్డ్ మంజూరుకు అనుమతిస్తూ జీవో ఉత్తర్వులను అనుమతి ఇస్తూ జీవో ఉత్తరం విడుదల చేసినట్లు తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం నందు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పౌర సరఫర శాఖ ఈమేరకు అర్హులందరికీ బియ్యం కార్డు ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామ సచివాలయంలో బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు పొందాలన్నారు. ఒంటరి మహిళలకు రేషన్ కార్డు మంజూరు నకు ప్రభుత్వము చర్యలు తీసుకుందన్నారు. కొత్త రేషన్ కార్డుకు, బియ్యం కార్డులను కుటుంబ సభ్యుల విభజనకు, కొత్త సభ్యులను చేర్చుకొనుటకు, చిరునామా మార్పుకు నేందుకు మృతి చెందిన వారి పేర్లను అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## గృహాలను త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని గృహ లబ్ధిదారులు తమ ఇళ్ళను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. వెలుగోడు మండల ప్రత్యేక అధికారిణి నాగమునేశ్వరి ఆదేశాలతో వెలుగోడు మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, హౌసింగ్ సిబ్బందికి శుక్రవారం సమావేశంలో పలు సూచనలు చేశారు. మండలం లోని వివిధ గ్రామాల్లో వున్న లేఅవుట్స్ సొంత స్థలములలో బేసిమెంట్, ఆర్ఎల్ఆర్‌సి, వివిధ దశలో వున్న గృహాలను జూన్ 10 లోపల ఇల్లు పూర్తి చేయించాలని టార్గెట్ రిచ్ కావాలని మండల స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ సిబ్బందికి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకుపై సూచనలు చేసినారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ మంద శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం సుగుణపాలు పాల్గొన్నారు.

## కిషోరి వికాసంపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని లక్ష్మి నగర్‌లో కిషోరి వికాసం కార్యక్రమం హెల్త్ సెక్రటరీ వరలక్ష్మి, మహిళా పోలీసు సరిత నిర్వహించడం జరిగింది. 11 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు షెడ్యూల్ ప్రకారం ట్రైనింగ్ ఇచ్చి ఆరోగ్య సూత్రాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శాంతకుమారి, ఆశాలు శీలం శాంతి, రాధమ్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర - బనగానపల్లె: జగద్గురు విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ప్రథమ పీఠం 332 ఆరాధన గురు పూజోత్సవ కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి. నంద్యాల రహదారిలో గల నేల మఠం నందు శుక్రవారం నాడు చివరి రోజు వీరబ్రహ్మేంద్ర స్వామికి పంచామృత అభిషేక అష్టోత్తర శతనామ పూజలు, షోడష కుంభహారలతో వేదోక్త సహిత మహా నివేదన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్య స్వామి, చైతన్య ఆచారి స్వామి, ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్య స్వామి మాట్లా డుతూ ఆరాధన సందర్భంగా మూడు రోజులు మూడు పూటలా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆరాధన కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎద్యుకేషన్: ఎన్నో సంవత్సరాల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషదాయకమని, సమయం లేకపోవడంతో డీఎస్సీ అభ్యర్థులు ఇబ్బందులకు గురవుతున్నారని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 16345 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయబోతున్నదని ఈ పోస్టులకు సుమారు నాలుగు లక్షల పైగా అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఓవైపు యుద్ధం జరుగుతున్నది, ఇంకోవైపు చదువుకునేందుకు సమయం సరిపోవడం లేదు అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 45 రోజుల నుండి 90 రోజులకు పెంచాలని, వర్గీకరణ వల్ల నోటిఫికేషన్ జాప్యం జరిగిందన్న విషయం ప్రభుత్వం తెలుసుకొని ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. 2018 డిఎస్సి నోటిఫికేషన్ తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా జారీ జరగలేదని ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు.